ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

వరంగల్

శనివారం 9 మార్చి 2024

5

కల్యాణమండపం పునర్నిర్మాణం అద్భుత ఘట్టం

- శివరాత్రి రోజు ఆ పరమశివుడికి అంకితం, ప్రజలకు పునరంకితం
- ప్రాచీన కట్టడాల పరిరక్షణ అందరి బాధ్యత
- కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రి కిషన్‌రెడ్డి
- కన్నుల పండువగా కల్యాణ మండపం ప్రారంభం



వివరాలు 7లో..





కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వర ఆలయం వద్ద సందడి



వేయిస్తంభాల ఆలయంలో కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు





నంది చెవిలో వేడుకుంటున్న భక్తులు

హరోం హర!

ఘనంగా శివరాత్రి వేడుకలు.. శివనామ స్మరణతో మారుమోగిన ఆలయాలు

మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం కన్నుల పండువగా జరిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ శివనామ స్మరణతో మారుమోగాయి. హర హర మహాదేవ శంభోశంకర్.. అంటూ భక్తులు తెల్లవారుజామున 4 గంటల నుంచే ఆలయాలకు తరలివెళ్లడం కనిపించింది. వెల్లువలా తరలివచ్చిన భక్తులతో శివాలయాలన్నీ కిక్కిరిసిపోయాయి. తండోపతండాలుగా తరలిరావడంతో ప్రతీ ఆలయం వద్ద భక్తులు బారులుతీరి నిల్చొని ఉండడం కనిపించింది. మండుతున్న ఎండను సైతం లెక్క చేయక భక్తులు ఆలయాలకు పోటెత్తారు. నగరంలోని దారులన్నీ శివాలయాలవైపే నడిచాయి. అర్ధరాత్రి పన్నెండు గంటల నుంచి లింగోద్భవ పూజల్లో పాల్గొని భక్తులు తన్మయత్వం చెందారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరమశివుడిని దర్శించుకొని తరించారు. మహాశివరాత్రి పర్వదినం వేళ వేలాదిగా తరలివచ్చిన భక్తులతో వేయిస్తంభాల ఆలయంతో పాటు పద్మాక్షి ఆలయం, మెట్టు రామలింగేశ్వరాలయం తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

\- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)

7

మళ్లీ బలరాముడే..

- మానుకోట లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్
- మహబూబాబాద్ నుంచి నాలుగోసారి బరిలోకి..
- ప్రకటించిన ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్



మహబూబాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాంనాయక్ పేరు ఖరారైంది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ.వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 7వ తేదీన సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశమై 8 రాష్ట్రాల నుంచి ఎంపీ అభ్యర్థులను ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 17 ఎంపీ స్థానాలు ఉండగా, తొలి జాబితాలో నలుగురు అభ్యర్థులను ఖరారు చేసింది. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ నేత సోనియాగాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ నాయకత్వంలో పార్టీ కేంద్రఎన్నికల కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

నాలుగోసారి..

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ములుగు జిల్లాలోని మారుమూల మదనపల్లె గ్రామానికి చెందిన నిరుపేద దంపతులు పోరిక లక్ష్మీబాయి-లచ్చునాయక్‌లకు నాలుగో సంతానంగా 6 జూన్ 1964న జన్మించిన బలరాంనాయక్.. 2009లో రాజకీయంగా ఆరంగేట్రం చేశారు. అప్పట్లో జాతీయస్థాయిలో జరిగిన పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనతో ఆవిర్భవించిన మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడ్ పార్లమెంటరీ స్థానం నుంచి తొలిసారి కాంగ్రెస్ తరుపున పోటీచేసి సమీప మహాకూటమి సీపీఐ అభ్యర్థి కుంజా శ్రీనివాస్‌రావుపై 68,957 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదే క్రమంలో పార్లమెంట్ లేబర్ కమిటీలో సభ్యుడిగా, బొగ్గు, విమాన యానశాఖ, రైల్వేశాఖ కన్వెన్షన్ కమిటీ సభ్యుడిగా కొనసాగారు. ఆపై జరిగిన యూపీఏ మంత్రివర్గ విస్తరణలో సామాజికవర్గ సమీకరణలు కలిసి రాగా, కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయ మంత్రి పదవి లభించింది. 2014, 2019లలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ నుంచి పోరిక బలరాంనాయక్ పోటీచేసి ఓటమిపాలయ్యారు. అంతకు ముందు 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహబూబాబాద్ నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ తరుపున పోటీచేసి ఓటమి చవిచూశారు. తిరిగి రానున్న 2024 పార్లమెంట్ ఎన్నికల్లో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు నేరుగా టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన వారి సంఖ్య 50 వరకు ఉండగా అధిష్టానం తిరిగి పోరిక బలరాంనాయక్‌కే టికెట్ ఖరారు చేసింది.

పోరిక బలరాంనాయక్ ప్రొఫైల్ :

పేరు	: పోరిక బలరాంనాయక్
పార్టీ	: కాంగ్రెస్
పదవి	: కేంద్ర మాజీ మంత్రి
విద్యార్హత	: ఎంఏ
పుట్టిన తేదీ	: 06-06-1964
భార్య	: తిరుపతమ్మ
పిల్లలు	: సాయిశంకర్, సాయికిరణ్
తల్లిదండ్రులు	: పోరిక లచ్చునాయక్-లక్ష్మీబాయి
స్వగ్రామం	: మదనపల్లి (ములుగు మండలం)
పరిచయం	: బలరాంనాయక్ హైదరా

బాద్ ఏపీఎస్పీ పోలీస్ ఉద్యోగంలో పని చేశారు. ఆ తర్వాత సెక్రటేరియట్ టెలికామ్ ఉద్యోగిగా చేరారు. మరోపక్క ఆలిండియా బంజారా సేవక్ సమాజ్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో ఆవిర్భవించిన మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ నుంచి పోటీచేసి గెలిచి కేంద్ర సహాయమంత్రి పదవిని అధిష్టించారు. 2014, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ తరుపున పోటీచేసి పరాజయం పాలయ్యారు. మరోమారు అక్కడి నుంచే ఎంపీగా పోటీచేసి, ఓటమిని చవిచూశారు.



కమలం గూటికి సీతారాంనాయక్

వివరాలు 6లో..

- ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- మహబూబాబాద్ బీజేపీ టికెట్‌పై మాజీ ఎంపీకి హామీ
- బీఆర్ఎస్‌లో గౌరవం లేదు, బీజేపీలో చేరికపై త్వరలో ప్రకటిస్తా: సీతారాం



ఓరుగల్లు హస్తం ఎవరికో?

తొలిజాబితాలో వరంగల్ ఎంపీ అభ్యర్థిని ప్రకటించని కాంగ్రెస్

- బలమైన అభ్యర్థి కోసం కాంగ్రెస్ అన్వేషణ
- బీఆర్ఎస్, బీజేపీలు సైతం ప్రకటించని వైనం

వరంగల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌లో వరంగల్ లోక్‌సభ టికెట్‌పై ఉత్కంఠ వీడటం లేదు. శుక్రవారం కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ నుంచి పోటీచేసే నలుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ ఎంపీ స్థానం నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ పేరును ప్రకటించగా, వరంగల్ స్థానం మాత్రం పెండింగ్‌లో పెట్టింది. కాగా, కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్, బీజేపీలు కూడా తమ అభ్యర్థులను ప్రకటించకపోవటంతో వరంగల్ టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ అన్ని పార్టీల కేడర్‌లో నెలకొంది.

బలమైన అభ్యర్థి కోసం..

వరంగల్ కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం 42 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఏఐసీసీ స్ర్కీనింగ్ కమిటీ 42మంది దరఖాస్తులను స్ర్కూటినీ చేసింది. వీరిలో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినా శనిగపురం ఇందిర, 2019 ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన దొమ్మాటి సాంబయ్యలతో పాటు నమిండ్ల శ్రీనివాస్ పేర్లతో అధిష్టానానికి స్ర్కీనింగ్ కమిటీ నివేదిక ఇచ్చింది. స్ర్కీనింగ్ కమిటీ ఇచ్చిన ముగ్గురు జాబితాపై సునిల్ కనుగోలుతో పాటు మరో రెండు సర్వే ఏజెన్సీలతో సర్వే చేయించారు. ప్రస్తుతం ఈ ముగ్గురికంటే ఇంకా బలమైన అభ్యర్థి అయితే బాగుంటుందనే అభిప్రాయాలు ఏఐసీసీ నుంచి వచ్చినట్లుగా సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు స్థానాల్లో ఆరు కాంగ్రెస్ గెలిచినప్పటికీ ఇక్కడ బీఆర్ఎస్, బీజేపీలు కూడా బలంగా ఉన్నట్లు కాంగ్రెస్ అధిష్టానం గుర్తించింది. వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో బీజేపీకి ఓట్లు బాగానే వచ్చాయని కాంగ్రెస్‌కు రిపోర్టులు వెళ్లాయి. దీంతో వరంగల్ స్థానంలో బలమైన అభ్యర్థిని బరిలోకి దించకపోతే ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చినట్లవుతుందని కాంగ్రెస్ డిల్లీ పెద్దలు అంచనా

మిగతా 8వ పేజీలో

ఎంజీఎం అభివృద్ధికి చర్యలు

- అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ మెడికల్, మార్చి 8: ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంజీఎం ఆస్పత్రిలో వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండా సురేఖ.. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి నూతనంగా నియామకమైన నర్సులకు క్యాపింగ్, బ్యాడ్జీలను ధరింపజేశారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మాతృమూర్తుల తర్వాత అంతటి గొప్పస్థానం వైద్య సిబ్బందికి దక్కుతుందని, పేషెంట్ల బాగోగులు చూసేది నర్సులేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటగా ఉద్యోగ నియామక పత్రాలు స్టాఫ్‌నర్సులకు అందజేశామని, మిగతా ఉద్యోగులకు అందజేత ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో నాలుగో తరగతి ఉద్యోగులు రోగులకు అందించే సేవలు మరువలేనివని, ప్రభుత్వం వారి సేవలను తప్పక గుర్తిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ తీరువల్ల చాలామంది ఉద్యోగులు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని తన దృష్టికి వచ్చిందని మంత్రి సురేఖ చెప్పారు. ఈ సమస్యలను వైద్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను చూపుతున్నామన్నారు. ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే సమీక్షిస్తామని తెలిపారు. రోగులకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు మంత్రి చెప్పారు.

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వైద్యరంగంలో రోగులకు సేవలందిస్తూ వృత్తికి గౌరవాన్ని తెస్తున్న నర్సుల సేవలు ప్రశంసనీయమన్నారు. మహిళలు చదువు, ఉద్యోగం, రాజకీయం, సామాజిక రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ నర్సులతో కలిసి కేక్ కట్‌చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, ఆర్ఎంఓలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మురళీ, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కార్తీక్, జనరల్ సెక్రటరీ, ఉపాధ్యక్షురాలు సల్మా, పి.సజని, సుప్రియ, ఉపాధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, ప్రసాద్, డాక్టర్ కె.అనితారెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- కాలేజీ భవనంపైనుంచి దూకి అఘాయిత్యం
- పరీక్షలు సరిగా రాయలేకనే అని సూసైడ్ నోట్



సాహిత్య (ఫైల్)

వరంగల్ క్రైం, మార్చి 9: హనుమకొండ జిల్లా భీమారం గ్రామంలోని ఓ ప్రైవేటు కళాశాల భవనంపై నుంచి దూకి వలుగుల సాహిత్య(16) అనే ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. మహాశివరాత్రి వేళలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామానికి చెందిన వలుగుల ప్రభాకర్-కవిత దంపతుల కూతురు సాహిత్య భీమారంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఇటీవల మొదటి సంవత్సరం పరీక్షలు రాస్తున్న సాహిత్య శుక్రవారం ఉదయం కళాశాల భవనం పక్కన శవమై కనిపించింది. గురువారం అర్ధరాత్రి కళాశాల భవనంపైకి ఎక్కి అక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకుందని పేర్కొంటూ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆపై విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

అయితే డాక్టర్ అవుదామని ఎన్నో ఆశలతో బీపీసీలో చేరానని, కానీ పరీక్షలు సరిగా రాయలేకపోతున్నానని, అందుకే చనిపోతున్నాని పేర్కొంటూ తన స్నేహితురాలికి రాసిన లేఖ రూములో లభించి నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఉదయం సమాచారం అందుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. యాజమాన్యమే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, యాజమాన్యాన్ని శిక్షించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాల ఎదుట ఆందోళన కొనసాగగా, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, కేయూ సీఐ చేరాలు, ఎస్ఐలు రాజ్‌కుమార్, సురేష్‌లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ విషయాన్ని ధ్రువీకరించిన ఎస్ఐ రాజ్‌కుమార్.. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్‌కార్డే ప్రమాణికమా..

ప్రభుత్వ పథకాలకు లింకు..

కొత్తకార్డులు ఇవ్వనిసర్కారు..

గృహజ్యోతి, ఇందిరమ్మ రాదేమోనని ఆందోళన

వర్ధన్నపేట, మార్చి 8: పేదలకు తక్కువ ధరలకు సరుకులు పంపిణీ చేయాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రభుత్వం తీసుకువచ్చింది. రేషన్‌కార్డుదారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతుండగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ పథకాలకు రేషన్‌కార్డును ప్రమాణికంగా తీసుకోవడంతో కార్డు లేని వారు ఆందోళన చెందుతున్నారు. పింఛన్ కావాలన్నా, రుణమాఫీ జరగాలన్నా రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉండాల్సిందేని ప్రభుత్వం తేల్చిచెబుతోంది. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర వేయి రూపాయల వరకు ఉంది. ఈ మొత్తాన్ని వినియోగదారుడు చెల్లించి గ్యాస్ సిలిండర్ తీసుకుంటే ఆ తర్వాత లబ్దిదారుని ఖాతాలో ప్రభుత్వం జమా చేస్తుంది. గ్యాస్ వినియోగదారుల్లో సైతం రేషన్‌కార్డుదారులే అత్యధిక శాతంగా ఉంటారు. బ్యాంకు ఖాతా సక్రమంగా పనిచేస్తున్న వారికే ప్రభుత్వం అందించే రాయితీ డబ్బులు జమ అయ్యే అవకాశం ఉంది. రేషన్ కార్డుకు అనుసంధానమై ఉన్న ఖాతా వినియోగదారులకు లేకపోతే తిరిగి పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. కొత్త బ్యాంకు ఖాతాలకు అనుమతి ఇస్తారో లేదోనేనే ఆందోళనలో వినియోగదారులు కొట్టుమిట్టాడుతున్నారు. నిత్యావసర ధరలతోనే ఇబ్బందులు పడుతున్న పేదలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో ఆర్థికంగా కొంత మేరకు ఊరట కలగనుంది.

కోడ్ వస్తుందోనని ఆందోళన..

గతంలో రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరించారు. కానీ ఆ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో అధికారులు రేషన్‌కార్డులు జారీ చేయలేదు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు ముంచుకొస్తుండడంతో ఈలోగానే కొత్తకార్డులు వస్తాయో లేదోనని ఆందోళన దరఖాస్తు దారులు ఆందోళన చెందుతున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అధికారులు దరఖాస్తులు స్వీకరించగా ఇందులో రేషన్‌కార్డు అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు అం దినట్లు అధికారులు పేర్కొన్న విషయం విదితమే. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణ యం తీసుకోలేదు. గత పది సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ లేకపోవడంతో ప్రతి నెలా వచ్చే బియ్యంతోపాటు ప్రభుత్వ పథకాలకు సైతం దూరమతున్నామని పేదలు ఆం దోళన చెందుతున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాల్సి అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

దరఖాస్తు దారుల్లో టెన్షన్..

రాష్ట్రవ్యాప్తంగా గృహజ్యోతి పథకం కింద రేషన్‌కార్డుదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్ పథకాన్ని ఇటీవల ప్రారంభించారు. ఎక్కువ మందికి రేషన్‌కార్డు లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. రేషన్‌కార్డు ఉన్నవారినే అర్హులుగా గుర్తించి అమలు చేస్తున్నారు. దీంతో తమకు ఉచిత విద్యుత్ ఉంటుందోలేదోనని ఆందోళన చెందుతున్నారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా అమలు చేయాలని కోరుతున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని..

- చనిపోతానంటూ లెటర్, ఫోన్ మెసేజ్‌లు
- బాధితుడు అగ్నిమాపక శాఖ కానిస్టేబుల్
- మిస్సింగ్ కేసు నమోదు



కృష్ణకుమార్

కరీమాబాద్, మార్చి 8: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడిన ఓ వ్యక్తి లక్షల్లో డబ్బులు పోగొట్టుకోవడంతో మనస్తాపానికి గురై, 'ఇక తనకు చావే దిక్కు' అంటూ తన భార్యకు లెటర్ రాసిపెట్టి, ఫోన్ మెసెజ్ చేసి ఇంట్లో నుంచి వెళ్లి పోయిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడి భార్య గజ్జెల మానస అలియాస్ కీర్తన తెలిపిన వివరాల ప్రకారం. కరీమాబాద్‌లో నివాసం ఉంటున్న గజ్జెల కృష్ణకుమార్ వర్ధన్నపేట మండలం అగ్నిమాపక శాఖలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి ఆన్‌లైన్ బెట్టింగ్ అలవాటు ఉంది. ఏడాది క్రితం బెట్టింగ్‌కు పాల్పడగా అధిక మొత్తంలో డబ్బులు పోగొట్టుకోవడంతో కుటుంబ సభ్యులు సర్ది చెప్పి బెట్టింగ్ పాల్పడకుండా ఉండాలని హితవు పలికారు. మళ్లీ పదిరోజులుగా తరచూ ఫోన్ చూస్తూ ఉండటంతో భార్య మానస ఎందుకు పదేపదే ఫోన్ చూసున్నావని ప్రశ్నించింది. దీంతో ఊరికే గేమ్ స్కోర్ చూస్తున్నానంటు సమా ధానం చెప్పేవాడు. ఈ క్రమంలో ఈనెల6న పులుకుర్తిలోని తమ బంధువుల ఇంట్లో ఓ శుభకార్యానికి దంపతులు తమ ఇద్దరు పిల్లలలో వెళ్లారు. సాయంత్రం మానసను అక్కడే ఉంచి కృష్ణకుమార్ ఒక్కడే కరీమాబాద్‌కు వచ్చి 7.30 గంటలకు తాను వర్ధన్నపేట డ్యూటీకి వెళ్తున్నట్లు భార్యకు ఫోన్ చేసి వెళ్లాడు. అదే రోజు రాత్రి 12.17 గంటలకు 'సారీ కీర్తీ, నేను చావడానికి డిసైడ్ అయ్యాను. ఆన్‌లైన్ బెట్టింగ్‌తో చావక తప్పడం లేదు, సారీ తప్ప ఏం చేయలేను, సారీ కీర్తి' అంటూ మెసేజ్ చేశాడు. వెంటనే మానస కరీమాబాద్‌కు చేరుకుని ఇంట్లో చూసే సరికి ఇంట్లో కూడా లెటర్ రాసిపెట్టి కనిపించింది. భర్త ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులు, సంబంధిత శాఖ కార్యాలయాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తన భర్త కనిపించడం లేదంటూ మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గజ్జెల మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.














కమలం గూటికి సీతారాంనాయక్

ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

మహబూబాబాద్ ఎంపీ టికెట్‌పై మాజీ ఎంపీకి హామీ



సీతారాంనాయక్‌తో భేటి అయిన కిషన్‌రెడ్డి

వరంగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్‌ఎస్‌కు మరో భారీ షాక్ తగిలేలా ఉంది. ఆ పార్టీ సీనియర్ నేత, మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ బీజేపీలో చేరనున్నారు. శుక్రవారం వరంగల్ పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ.కిషన్‌రెడ్డి స్వయంగా సీతారాంనాయక్ ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. తెలంగాణ ఉద్యమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి సీతారాంనాయక్ కీలక పాత్ర పోషించారు. దీంతో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్.. సీతారాంనాయక్ సేవలు గుర్తించి 2014లో మహబూబాబాద్ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించిన సీతారాంనాయక్ ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిపై పార్లమెంట్‌లో తరుచుగా గళమెత్తారు. అయితే 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రొఫెసర్ సీతారాంనాయక్‌కు కేసీఆర్ బీఆర్‌ఎస్ టికెట్ నిరాకరించారు. దీంతో అప్పట్లోనే అసంతృప్తిగా ఉన్న సీతారాంనాయక్‌కు రాజ్యసభ, ఎమ్మెల్సీతో పాటు నామినేటెడ్ పోస్టులను ఆశగా చూపించారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని సీతారాంనాయక్ అధిష్ఠానాన్ని కోరారు. అయినప్పటికీ ప్రొఫెసర్‌కు నిరాశే మిగిలింది. దీంతో కనీసం ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో మరోసారి మహబూబాబాద్ నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు కీలక నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే మహబూబాబాద్ నుంచి మరోసారి సిటింగ్ ఎంపీ మాలోతు కవితకే బీఆర్‌ఎస్ కేటాయించింది. దీంతో తీవ్ర నిరాశలో ఉన్న సీతారాంనాయక్ బీజేపీలో చేరనున్నట్లు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది.

పార్టీలోకి అహ్వానించిన కిషన్‌రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రెండు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్నారు. వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. శుక్రవారం ములుగులో గిరిజన యూనివర్సిటీలో తాత్కాలిక తరగతుల నిర్వహణకు ప్రారంభం చేసిన కిషన్‌రెడ్డి.. నేరుగా హనుమకొండలోని మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్ ఇంటికి వెళ్లి కలిశారు. సీతారాంనాయక్‌ను శాలువాతో సన్మానించి, బీజేపీలోకి రావాల్సిందిగా కిషన్‌రెడ్డి ఆహ్వానించారు. ఎస్టీల హక్కుల కోసం, గిరిజన యూనివర్సిటీ కోసం ఎంపీగా సీతారాంనాయక్ ఎంతో కృషి చేశారని, అందుకే శాలువాతో సన్మానించి, పార్టీలోకి అహ్వానించినట్లుగా కిషన్‌రెడ్డి తెలిపారు.

గౌరవం లేని చోట ఎందుకు ఉండాలి

తనకు బీఆర్‌ఎస్‌లో అనేక అవమానాలు జరిగాయని, కనీస గౌరవం కూడా లేదని మాజీ ఎంపీ సీతారాంనాయక్ పేర్కొన్నారు. గౌరవం లేని చోట ఎందుకు ఉండాలని, గౌరవించిన వాళ్ల దగ్గరికే ఎందుకు వెళ్లకూడదని ప్రశ్నించారు. ఐదేళ్లుగా ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌కు పార్టీ బాధ్యతలు అడిగినా ఇవ్వలేదు.. సొంత ఖర్చులు పెట్టుకొని పార్టీ కాపాడుకుంటే కనీసం టికెట్ ఇవ్వకుండా అవమాన పర్చారని వాపోయారు. కుటుంబసభ్యులు, కార్యకర్తలతో చర్చించిన తరువాత బీజేపీలో చేరే విషయంపై కార్యాచరణ ప్రకటిస్తానని సీతారాంనాయక్ తెలిపారు.







విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ

ముగిసిన జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 8: ఆల్ ఇండి యా టెన్నిస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థా యి పురుషుల ఓపెన్ టెన్నిస్ పోటీలు శుక్ర వారం ముగిశాయి. ముగింపు వేడుకలకు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై హోరాహోరీగా జరిగిన టెన్నిస్ పోటీల్లో విజేతగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆఫీసర్ క్లబ్ వివిధ క్రీడలకు నిలయంగా మారిందని, మిగతా క్రీడాపోటీలకు దీటు గా ఓపెన్ టెన్నిస్ పోటీలను నిర్వహించినందుకు ఆఫీసర్స్ క్లబ్ సభ్యులను అభినందించారు. విశిష్ట అతిథి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడు తూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. గెలిచిన వారు పొంగకుండా ఓడిన వారు నిరాశ చెందకుండా పోటీతత్వంలో సాధన చేస్తే అనుకూల లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు మట్లాడుతూ.. ఆరు రోజులుగా ఆఫీసర్స్ క్లబ్ వేదికగా నిర్వహించిన ఓపెన్ టూ ఆల్ పురుషుల టెన్నిస్ టోర్నమెంట్‌లో 10 రా ష్ట్రాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. సింగిల్స్ డబు ల్స్ విభాగాల్లో నిర్వహించిన ఈ టోర్నిలో ఏజ్ కేటగిరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు సుమారు రూ.1లక్ష నగదు పారితోషికంతో పాటు బహుమతులను, సర్టిఫికెట్లను ప్రదానం చే యనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి మురుగన్, రాష్ట్ర ఈసీ మెంబర్ బాబురెడ్డి, ఆర్గనైజింగ్ ప్రతినిధులు కన్నారెడ్డి, డాక్టర్ ప్రవీణ్, మనోహర్‌రెడ్డి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● సింగిల్స్ విన్నర్స్: తరుణ్ కర్ర ప్రథమ స్థానం, ప్రత్యూష్ మహంతి ద్వితీయ స్థానంలో నిలిచారు.

● మెన్స్ డబుల్స్‌లో..: వినిత్ ముత్యాల, సాత్విక్ మురళి ప్రథమ స్థానం, కేఎస్ కవీన్ కార్తీక్, ప్రగతీష్ శివశంకర్‌లు ద్వితీయ స్థానంలో నిలిచారు.

నేడు వర్సిటీకి పనిదినం

కేయూ క్యాంపస్, మార్చి 8: కాకతీయ యూనివర్సిటీ, ఇతర అనుబంధ కళాశాలలన్నీ మార్చి 9న శనివారం యథావిధిగా పనిచేస్తాయని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 23న సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా సెలవు ప్రకటించిన సందర్భంగా మార్చి 9న రెండో శనివారం పనిదినంగా ప్రకటించినట్లు వెల్లడించారు. వర్సిటీ పరిధిలోని కళాశాలలు, డిపార్టుమెంట్‌లకు, కార్యాలయాలు పనిచేస్తాయని వెల్లడించారు.

కల్యాణ మండపం పునర్నిర్మాణం అద్భుత ఘట్టం

శివరాత్రి రోజు ఆ పరమశివుడికి అంకితం, ప్రజలకు పునరంకితం

కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కల్యాణ మండంలో పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హనుమకొండ, మార్చి8 (ఆంధ్రజ్యోతి): వేయి స్తంభాలగుడి కల్యాణమండపం పునరుద్ధరణ ఓ అద్భుత ఘట్టం అని కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. రూ.15కోట్ల వ్యయంతో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని కిషన్‌రెడ్డి శుక్రవారం వేద మంత్రాల మధ్య ప్రారంభించారు.

ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి, ఎంతో ఓర్పుతో, నైపుణ్యంతో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని మహాశివరాత్రి పర్వదినాన ప్రారంభించినందున్న దీనిని ఆ పరమశివుడికి అంకితమిస్తున్నానని అన్నారు. యావత్ ప్రజలకు పునరంకితం చేస్తున్నానని ప్రకటించారు. కాకతీయుల కాలం స్వర్ణయుగంగా ఆయన అభివర్ణించారు. ఒక చిన్న కల్యాణ మండపాన్ని విప్పి తిరిగి నిర్మించడానికి పంతొమ్మిదేళ్ల పట్టిందని, ఆ కాలంలో అనేక దేవాలయాలు, కోటలు, అనేక ఇతర కట్టడాలను కట్టడానికి ఇంకెన్ని యేళ్లు పట్టి ఉండొచ్చోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇలాంటి కట్టడాలను దర్శించి, అనుభూతి పొందినప్పుడు వాటి ప్రాముఖ్యత ఏమిటో తెలుస్తుందని కిషన్‌రెడ్డి అన్నారు. అందువల్ల ప్రాచీన కట్టడాలను, కళాఖండాలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాకతీయ రాజు రుద్రదేవుడు వేయిస్తంభాల గుడి కట్టడానికి 72 ఏళ్ల పట్టిందని, ఇలాంటి అనేక దేవాలయాలను నిర్మించడంలో అనుసరించిన ఇంజనీరింగ్ విధానం అద్భుతమని కొనియాడారు. హిందువులను తమ మతంలోకి మార్చుకోవడానికి 1320లో అప్పటి ముస్లిం పాలకులు ఒక ఎజెండాగా తీసుకొని ప్రణాళిక ప్రకారం లక్షలాది దేవాలయాలను విచక్షణారహితంగా ధ్వంసం చేశారని, అలా ధ్వంసమైన వాటిలో పునరుద్ధరించిన వేయిస్తంభాలగుడిలో ప్రస్తుతం పునరుద్ధరించిన నందీశ్వరుడు కూడా ఉన్నాడన్నారు. కల్యాణ మండపం పునర్నిర్మాణంతో వేయిస్తంభాల గుడికి సంపూర్ణ రూపం వచ్చిందని కేంద్ర మంత్రి అన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత కల్యాణ మండపం పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తికావడంపై దృష్టి పెట్టానని, ఆ మహాశివుడి ఆశీస్సులతో పూర్తి చేయగలిగామని అన్నారు. కాకతీయుల సాండ్‌బాక్స్ టెక్నాలజీనే ఉపయోగించి మరో వెయ్యేళ్లు నిలిచి ఉండేలా మండపాన్ని పునర్నించారన్నారు. మండపం పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన స్థపతి శివకుమార్ శ్రీనివాసన్‌ను కేంద్ర మంత్రి అభినందించారు. నిట్ రిటైర్ ప్రొఫెసర్ పాండురంగారావు కృషి వెలకట్టలేనిదన్నారు. కేంద్రపురావస్తుశాఖ (ఏఎస్ఐ) అధికారులు, సిబ్బంది మండపం పూర్తికి విశేష కృషి చేశారని కొనియాడారు.

కేంద్ర పురావస్తు శాఖ ప్రాచీన కట్టడాలను పరిరక్షించడంలో విశిష్టమైన పాత్రను పోషిస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల్లో అనేక కట్టడాలు ఏఎస్ఐ పరిధిలోకి రాగా, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల తెలంగాణలో కేవలం ఏడు ప్రాచీన కట్టడాలు మాత్రమే ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఏఎస్ఐ పరిధిలోకి తీసుకురావలసిన ప్రాచీన కట్టడాలు ఇంకా అనేకం ఉన్నాయని అన్నారు. వీటన్నిటికీ ఏఎస్ఐ ఆధీనంలోకి తేవడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే కేంద్రపురావస్తు చట్టం చాలా కఠినంగా ఉంటుందని, ప్రాచీన కట్టడాలకు ఏ చిన్నమరమ్మతులు చేయాలన్నా, మార్పులు చేర్పులు జరపాలన్నా పలు అంక్షలు అడ్డువస్తాయన్నారు. పాండవుల గుట్టను ఏఎస్ఐ కిందకు తీసుకురావడానికి ప్రయత్నించగా అటవీశాఖ అభ్యంతరం తెలిపిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఉన్న ప్రాచీన కట్టడాల నిర్వహణకు నిధుల కొరత కొంత అడ్డంకిగా ఉందన్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం అభివృద్ధికి చాలినన్ని నిధులను ఇస్తామన్నారు.

శాసన మండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్న అనేక అపురూప కట్టడాలను ఏఎస్ఐ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. రామప్పలాగానే హనుమకొండ వేయిస్తంభాల గుడిని కూడా యునెస్కో పరిధిలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవలసిందిగా కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. ఖిలా వరంగల్‌లోలాగానే వేయిస్తంభాల గుడిలో సౌండ్‌అండ్ లైట్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు కాకతీయుల రాజధానిగా విలసిల్లిన ఓరుగల్లు.. కళలకు, కళాఖండాలకు కానాచి అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ నగరం అభివృద్ధి పరంగా ఎంతో వెనుకబడిందన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, స్మార్ట్ సిటీ పథకం కింద నిధులు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రాలను సమర్పించారు. కాగా, కల్యాణ మండపం పునర్నిర్మాణంపై కేంద్ర పురావస్తుశాఖ రూపొందించిన ఐదునిముషాల నిడివిని డిజిటల్ స్ర్కీన్‌పై ప్రదర్శించారు.

సత్కారం

కల్యాణ మండపం పునర్నిర్మాణంలో పనిచేసిన స్థపతి శివకుమార్, ఆయనతోపాటు పని చేసిన తమిళనాడుకు చెందిన శిల్పులకు శాలువాలు కప్పి పూలుచల్లి సత్కరించారు. మండపాన్ని పూర్వరూపానికి తీసుకురావడంలో భాగస్వాములైన నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండు రంగారావు, కేంద్ర పురావస్తుశాఖ ఉన్నతాధికారులు, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ తదితరులకు శాలువాలు కప్పి జ్ఞాపికలను అందచేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ ఉన్నతాధికారులతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యేలు ఎం.ధర్మారావు, వన్నాల శ్రీరాములు మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

శాంతిపూజ

మండపం ప్రారంభానికి ముందు కేంద్ర మంత్రి వేయిస్తంభాలగుడి ఆవరణలోని యాగశాలలో శాంతిపూజలో మహాచండీ యాగం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న కేంద్ర మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కిషన్‌రెడ్డి వేయిస్తంభాలగుడిలో రుద్రేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. పూజలు జరిపారు.



కల్యాణ మండంలోకి వస్తున్న కిషన్‌రెడ్డి



వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో సమావేశమైన కార్పొరేటర్లు

ఎమ్మెల్యే నాగరాజుతో బీఆర్ఎస్ కార్పొరేటర్ల భేటీ

కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం

వరంగల్ క్రైం, మార్చి 8: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ కార్పొరేటర్లు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో భేటీ అయ్యారు. శుక్రవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసానికి ఆరుగురు కార్పొరేటర్లు వెళ్లి ఆయనను శాలువాతో సత్కరించారు. ఆరుగురిలో ఒకరిద్దరు మినహా మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం సాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆరుగురు కార్పొరేటర్లు ఎమ్మెల్యేను కలవుడం గమనార్హం. కాగా, మహిళా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశామని కార్పొరేటర్లు చెబుతున్నప్పటికీ కాంగ్రెస్‌లోకి జంప్ కావడం వాస్తవమని సమాచారం. ఇప్పటికే వీరికి ఎమ్మెల్యే నాగరాజు పలుమార్లు ఫోన్ చేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించినట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల ముందే కాంగ్రెస్‌లో చేరాలని పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఇటీవల రహస్య సమావేశం నిర్వహించుకున్నట్లు సమాచారం. పార్టీ మారాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగానే మహిళా దినోత్సవం పేరిట ఎమ్మెల్యే నాగరాజును కలిసినట్లు సమాచారం. తనను కలిసిన కార్పొరేటర్లను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. కాగా ఆరుగురు కార్పొరేటర్లు ఎమ్మెల్యేను కలువడం బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు సరికాదు

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక నేత ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే

వడ్డెపల్లి, మార్చి 8: భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం సరికాదని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. మావోయిస్టుల లింకు కేసులో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్. సాయిబాబాతోపాటు మరో ఐదుగురిని బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించి వారిని విడుదల చేసింది. సాయిబాబా విడుదలను పురస్కరించుకొని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో హర్షాన్ని ప్రకటిస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా కాత్యాయని విద్మహే మాట్లాడుతూ.. 90 శాతం అంగవైకల్యం ఉన్న సాయిబాబా మరొకరి సహాయం లేనిదే తనపని తాను చేసుకోవడం కూడా అసాధ్యమని అన్నారు. అలాంటి వ్యక్తిని పదేళ్లపాటు జైల్లో నెట్టి కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామిక విలువలను ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పౌరస్పందన వేదిక అధ్యక్షుడు కరేటి శంకర్‌రావు యాదవ్, ప్రజా సంఘాల నాయకులు మెట్టు రవీందర్, అనిశెట్టి రజిత,రామలక్ష్మి, బి. రమాదేవి, ఎం.డి. బాసిత్, వెంగళ్‌రెడ్డి, బిల్లా మహేందర్, బోనగిరి రాములు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

కేయూ దూరవిద్యలో ప్రవేశాలు

డిగ్రీ, పీజీ కోర్సుల్లో దరఖాస్తులకు ఆహ్వానం ● 26 వరకు ఆల్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెల్లడి



ప్రవేశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రమేశ్, డైరెక్టర్ రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్, మార్చి 8: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు వివరాలను వెల్లడించారు.

డిగ్రీ మూడేళ్ల కోర్సుల్లో బీఏ హెచ్‌పీపీ, ఎస్‌పీపీ, బీకామ్ జనరల్, కంప్యూటర్, బీబీఏ, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎల్ఐఎస్సీ కోర్సులున్నాయని తెలిపారు. అలాగే ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, హ్యూమన్‌రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ సైకాలజీ, ఎన్విరాల్‌మెంట్ సైన్స్, గణితం, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఎంఎల్ఐఎస్సీ కోర్సులున్నాయని తెలిపారు. డిప్లొమా కోర్సుల్లో బిజినెస్ మేనేజ్‌మెంట్ రిటైల్ మార్కెటింగ్, ట్యాలీ, కంప్యూటర్ అప్లికేషన్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మిమిక్రీ, వోకల్ మ్యూజిక్, ఇన్స్ట్రుమెంటేషన్ మ్యూజిక్, సాఫ్ట్‌స్కిల్స్, మీడియా ఫొటోగ్రఫీ కోర్సులున్నాయని వివరించారు. కోర్సుల్లో ప్రవేశాలకు మార్చి 26 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్లు పొందవచ్చునని పేర్కొన్నారు. రూ.300 అపరాధరుసుంతో మార్చి 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. ఫీజు, కోర్సు వివరాలు, ప్రవేశార్హతలు వర్సిటీ వెబ్‌సైట్ హ్టీఇ://టీటీటీ.టీజూఛ్జిజుంబొ.జీ/లో అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.

కేయూ దూరవిద్యకేంద్రం తెలంగాణలో పెద్ద డ్యూయల్ మోడ్ వర్సిటీ అని వీసీ రమేశ్ చెప్పారు. గ్రామీణ, పట్టణ, ఉద్యోగార్థులు, పార్టుటైమ్ ఉద్యోగాలు చేసేవారికీ బాగా ఉపయోగపడుతోందని తెలిపారు. ప్రత్యేక్ష కాంట్రాక్టు తరగతులు, ఆన్‌లైన్, రేడియో తరగతులతోపాటు వివిధ మాధ్యమాలతో బోధన ఉంటుందని వెల్లడించారు. యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బోర్డు, ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థలతోపాటు వర్సిటీ చట్టం మేరకు తరగతుల నిర్వహణతో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిత్వవికాస తరగతులు, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ స్కిల్స్ నేర్పిస్తామని వెల్లడించారు. ప్రవేశాల పొందిన విద్యార్థులకు ఎప్పటికప్పుడూ వెబ్‌సైట్, సెల్‌ఫోన్‌లో సంక్షిప్త సమాచారం అందుతోందని వెల్లడించారు. బ్రోచర్ విడుదల చేసినవారిలో కేయూ సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, డీవో ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీవి విద్యా వ్యతిరేక విధానాలు



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ స్టాలిన్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 8: భారతీయ జనతా పార్టీ విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్ స్టాలిన్ మాట్లాడారు. విద్య కాషాయికరణ, ప్రైవేటీకరణ, కేంద్రీకరణ కోసమే జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెడుతోందని ఆరోపించారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా నూతన జాతీయ విద్యా విధానం ఉందన్నారు. ఎన్ఈపీని ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, బడుగు, బలహీన, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో బీజేపీ విఫలమైందన్నారు. ఎన్ఈపీ రద్దు కోసం ఏఐఎస్ఎఫ్ దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణ తోపాటు ఉద్యమాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మారుమోగిన శివనామస్మరణ



వేయిస్తంభాల ఆలయం వెలుపల బారులుతీరిన భక్తులు

హనుమకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాలగుడిని వేలాది మంది సందర్శించారు. స్వామి వారికి మహారుద్రాభిషేకాలు జరిపారు. ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని తెల్లవారుజామున 3.30 గంటలకు సుప్రభాతం, 4 గంటల నుంచి స్వామివారికి సామూహిక రుద్రాభిషేకాలు, నిత్యవిధి, హవనం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఎండలోనూ భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి వేచి ఉన్నారు. వేయిస్తంభాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రుద్రేశ్వర కల్యాణం

వేయిస్తంభాల గుడిలో సాయంత్రం 6.59 గంటలకు ధనిష్ట నక్షత్రయుక్త సింహలగ్న సుముహూర్తాన శ్రీ రుద్రేశ్వరీ రుద్రేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆగమ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గణపతి పూజ, ఉత్సవమూర్తుల ఎదురుకోలు, బాషికధారణ, జీలకర బెల్లం, యజ్ఞోపవీత ధారణ,, మహా సంకల్పంలాంటి వైదిక కార్యక్రమాలను నిర్వహించి కల్యాణోత్సవం తలంబ్రాల పర్వం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ కల్యాణ తంతును పర్యవేక్షించారు. ఈవో వెంకటయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్తల పురాణ ప్రవచనంతో భక్త జనులు పులకించిపోయారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆశీనులను చేసిన శ్రీరుద్రేశ్వరీ, రుద్రేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఎంతో అందంగా అలంకరించారు. వేయిస్తంభాల ఆలయంలో జాగరణ చేసే భక్తుల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పలు ఇతర ఆలయాల్లో..

వరంగల్ కోటలోని స్వయంభూ శంభులింగేశ్వరాలయం, వరంగల్ మట్టేవాడలోని భోగేశ్వరాలయం, భద్రకాళిగుడిలోని భద్రేశ్వర స్వామి ఆలయం, హనుమకొండలోని సిద్ధేశ్వరాలయం, మడికొండలోని మెట్టురామలింగేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉజ్జయినీ మహాకాళేశ్వర శివలింగ దర్శనం, 12 అడుగుల మహాశివలింగాన్ని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని శ్రీగట్టుమల్లికార్జున స్వామి ఆలయం, ములుగు జిల్లా పాలంపేటలోని చారిత్రక రామప్ప దేవాలయం, ఆత్మకూరులోని పంచకూట ఆలయం, వరంగల్ ఉర్సు జాగీరులోని ఫణిగల రామప్ప గుడి, ఐనవోలులోని ప్రాచీన మల్లికార్జునస్వామి ఆలయం, వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, కరీమాబాద్‌లోని విశ్వేశ్వరాలయం, కాశిబుగ్గలో ని విశ్వేశ్వరాలయం, జనగామ జిల్లా కుందారం గ్రామంలోని కుందేశ్వరాలయం, మహబూబాబాద్ జిల్లా కురవిలోని వీరభద్రస్వామి ఆలయం, నీరుకుళ్లలోని చెన్నకేశవ ఆలయం సహా పలు శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. వరంగల్ రామన్నపేటలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆల యం, వరంగల్‌లోని దుర్గేశ్వర స్వామి ఆలయం, ఆత్మకూరు మండలం కటాక్షపురంలోని త్రికూటాలయం దామెర మండల కేంద్రంలోని దామేశ్వరాలయంతో సహ పలు ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు నేత్ర పర్వంగా జరిగాయి.

మంత్రుల పూజలు

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వేయిస్తంభాలగుడి, భద్రకాళి గుడిని, రామప్ప ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ నగరంలోని పలు దేవాలయాలను సందర్శించి శివపూజలు చేశారు. వరంగల్ శివనగర్‌లోని రామాలయం ఖిలావరంగల్‌లోని స్వయం భూ దేవాలయం తదితర ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. భీమదేవరపల్లి మండలం వంగర, ముత్తారం శివాలయాల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా వేయిస్తంభాలగుడిని సందర్శించి పూజలు నిర్వహించారు.



ఒగ్గు పూజారులు వేసిన పెద్దపట్నం వద్ద బండారి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు, పాల్గొన్న డీసీపీ, ఏసీపీ, ఈవోలు

శిగాలూగిన మల్లన్న క్షేత్రం

ఐనవోలు, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఐనవోలు మల్లికార్జునస్వామి శైవక్షేత్రంలో పరమశివుడి సేవలో భక్తులు పరవశించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో దేవస్థానం ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం స్వామి వారి మేలుకొలుపు సుప్రభాత ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అభిషేకాలు కొనసాగాయి. భక్తులు మొక్కులు చెల్లించి స్వామివారిని దర్శించుకున్నారు.

స్వామి వారికి సింహవాహనసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు ఉదయం 8 గంటలకు సింహవాహనసేవలో(స్వామి వారిని) మాఢవీధుల గుండా ఊరేగించారు. యాగశాలలో రుద్రహోమాలు అష్టోత్తర 108 కలశాల్లో నదీసముద్రజలాలు, సుగంధ ద్రవ్యాలు, అభిషేక ద్రవ్యాలు ఉంచి నాలుగు కాలముల్లో పూజించారు. ఈ కలశాలతో లింగోద్భవకాలంలో మహాభిషేకం నిర్వహించారు. రాత్రి వేళ నందివాహన సేవను నిర్వహించారు. ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

పెద్దపట్నంపై భక్తుల శివతాండవం

మల్లన్న స్వామికి అత్యంత ప్రీతికరమైన పెద్దపట్నంను ఒగ్గు పూజారులు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల చూర్ణాలు(పిండి) ముగ్గులతో కాకతీయులు నిర్మించిన నృత్య మండపంలో పట్నం (మండపం)ను 12 అడుగుల వెడల్పు, పొడువుతో అందంగా వేశారు. మధ్యలో స్వామి అమ్మవార్లను పూజించి అవాహనం చేసి ఒగ్గు కథ ద్వారా కల్యాణ గాధను పఠించారు. తదుపరి భక్తి పారవశ్యంతో పట్నంపై మైమరిచి శివతాండవం నృత్యం చేశారు. వందల సంఖ్యలో పెద్దపట్నంపై నృత్యాలు చేయడం కనువిందుగా నిలిచింది. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై అనిల్‌కుమార్ నేతృత్వంలో సుమారు 150 మంది పోలీసులు నృత్య మండపం వద్ద తొక్కిసలాట జరుకుండా కట్టడి చేశారు. భక్తులు నృత్యాలు చేయడానికి చూడటానికి మండపం వద్ద పోటీ పడి నెట్టుకున్నారు.

కమనియం మల్లన్న స్వామి కల్యాణం

ఐనవోలు మల్లికార్జునస్వామి కల్యాణం కనులపండుగగా కనువిందు చేసింది. భ్రమరాంబమల్లికార్జునస్వామి వారిని నంది వాహనంపై నాలుగు వీధుల్లో కనువిందు చేసి కల్యాణ మండపానికి తీసుకవచ్చారు. వేద మంత్రోచ్ఛరణ నడుమ శైవాగమ శాస్త్రోక్తంగా యాగ్నికులు శ్రీనివాస్‌కుశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, పురోహిత్ ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితుడు పురుషోత్తంశర్మ, విక్రమ్ జోషి, యాగ్నికులు శ్రీకాంత్‌శర్మ అర్చక బృందం కల్యాణం జరిపారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తీసుకవచ్చారు. పట్టువస్త్రాలు, ఉత్సవ విగ్రహాలతో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికు చేరుకున్నాక సుమారు 2గంటల పాటు కల్యాణం నిర్వహించారు. భక్తులు శివనామస్మరణతో అసాంతం తన్మయతంతో తనివితీరాస్వామిని సేవించి భక్తిని చాటుకున్నారు. కల్యాణంలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కూతురు దివ్యరాజ్, కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ బొల్లేపల్లి మధుగౌడ్, మోహన్‌గౌడ్, మార్నేని వెంకటేశ్వర్‌రావు, రాయపురం సాంబయ్య, అనుముల రవీందర్, పల్లకొండ రమేష్, గిరుక రాజు, రాజిరెడ్డి, ఐనవోలు గ్రామ పుర్రప్రముఖులతోపాటు ఆయా ప్రాంతాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు కల్యాణ తంతులో పాల్గొన్నారు.



తాళి చూపిస్తున్న దృశ్యం





మధ్యకోటలోని స్వయంభూ దేవాలయంలో..



సంఘమేశ్వరాలయంలో మంచులింగం ఏర్పాటు



కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వరాలయంలో శివలింగాన్ని అలంకరించిన భక్తులు

గద్దర్ ఆలోచన విధానం అనుసరించాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఐక్య వేదిక ప్రతినిధులు

సంగెం, మార్చి 8 : గద్దర్ ఆలోచనా విధానం సామాజానికి అవసరమని గద్దర్ ఆలోచన ఐక్య వేదిక కమిటీ కోఆర్డినేటర్లు సుద్దాల నాగరాజు, ఐతె అనిల్‌లు అన్నారు. జక్కలొద్దిలోని రామ సురేందర్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామ సందీప్, కార్యదర్శి గజ్జె చందుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాస్వామిక తెలంగాణ గద్దర్ ఆలోచనలు కరపత్రాన్ని ఆవిష్కరించారు. నాగరాజు, అనిల్‌లు మాట్లాడుతూ గద్దర్ ప్రజల కోసం సర్వసం త్యాగం చేశారన్నారు. ప్రజలతోమమేకమై ప్రజా ఉద్యమాలు నిర్మించి అనేక పోరాటాలు చేసిన ఘనత గద్దర్‌దేనన్నారు. హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో గద్దర్ కళాక్షేత్రం ఏర్పాటు చేయాలి, గద్దర్ విగ్రహంను ఏర్పాటు చేయాలి, గద్దర్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని నాగరాజు, అనిల్‌లు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామ సురేందర్ నగర్ సభ్యులు బక్కి శివ, బిర్రు మహేందర్, అల్లాడి యాకయ్య చేగొండ రాజు పాల్గొన్నారు.

కొమ్మాల ఆలయ అభివృద్ధికి కృషి : రేవూరి

గీసుగొండ, మార్చి 8: కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. 17 నుంచి 31 వరకు నిర్వహించే శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జాతరలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.60 లక్షలను మంజూరు చేయించగా, పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ప్రధాన ఆర్చిగేటు నుంచి ఆలయం వరకు రోడ్డు వెడల్పు, గుట్ట చుట్టూ రోడ్డు నిర్మాణం కోసం మరో రూ. 68 లక్షలతో ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతామన్నారు. జాతరలో కరెంటు, నీటి వసతి, వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. జాతర వేలంపాట, నిర్వాహణ తదితర అంశాల గురించి ఈవో శేషాద్రిని ఎమ్మెల్యే అడుగుగా సరైన సమాధానం చెప్పకపోవటం ఆగ్రహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సౌజన్య పాల్గొన్నారు.

ఎస్ఆర్‌నగర్‌లో బొడ్రాయి పూజలు



ఎస్ఆర్‌నగర్‌లో బొడ్రాయి పూజలు చేస్తున్న కాలనీ వాసులు

వరంగల్ సిటీ, మార్చి 8 : నగరంలోని 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌లో శుక్రవారం కాలనీ వాసులు శ్రీభూలక్ష్మి సమేత భువనేశ్వరస్వామి బొడ్రాయి భూమి పూజా కార్యక్రమం వేదపండితులు నిత్య నిర్మలానంద యాత్ర యోగేశ్వర స్వామి, పురోహితులు రాచర్ల రాజు అయ్యగార్లతో వైభవంగా జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, నగర కార్యదర్శి బాషుమియా, డివిజన్ అధ్యక్షులు ఇంతియాజ్, బొడ్రాయి కమిటీ సభ్యులు,భూమి పూజాది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏప్రిల్ 11న హోమాలు, జలాదివాసం, 12న అభిషేకములు, అర్చనలు, 13న యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి అన్న ప్రసాదము, శ్రీభూలక్ష్మి భువనేశ్వరస్వామి కల్యాణం నిర్వహించబడుతాయని పురోహితుడు రాజు తెలిపారు. కార్యక్రమంలో కేతిరి రాజశేఖర్, అంబాల సత్యం, పసులాది మల్లయ్య, ఎం.నర్సింహ, తాళ్లపెల్లి రహేలా, స్టాలిన్, దామెర క్రిష్ణ పాల్గొన్నారు.

మహాదేవుడికి మహా పూజలు

▸▸ నగరంలో వైభవంగా శివరాత్రి వేడుకలు ▸▸ ఆలయాలకు పోటెత్తిన భక్తులు ▸▸ కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం నగరంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో శివలింగాలకు అభిషేకాలు, అర్చనలు చేసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఓం నమఃశివాయ.. హరహర మహదేవ అంటూ శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. రాత్రంతా జాగరణ ఉంటూ శివుడిని జపించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాలు కన్నుల పండువగా జరిగాయి.

వరంగల్ కల్చరల్, మార్చి 8 : వరంగల్ రామన్నపేటలోని శ్రీరామలింగేశ్వరాలయం, పోతన రోడ్డు కుంటిభద్రయ్య గుడి, రంగంపేట భవానిశంకర ఆలయం, శ్రీభద్రకాళి అమ్మవారి భద్రేశ్వర ఆలయం, మట్టెవాడలోని శ్రీభోగేశ్వరాలయం, పిన్నవారి వీధిలోని శ్రీరుద్రేశ్వరాలయం, స్టేషన్ రోడ్డులోని ఆకారపు వారి గుడి, పోచమ్మ దేవాలయం, గోవిందరాజుల గుట్ట ఆలయం, గిర్మాజీపేట శివాలయం, కూరగాయల మార్కెట్ సమీపంలోని శివాలయం, గీతాభవన్ శివాలయం, పీఎన్ బీ లైన్‌లో శ్రీదత్తాత్రేయ ఆలయం, మండిబజార్‌లోని సాయి దేవాలయం, కొత్త వాడలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయం, దేశాయిపేటలోని శివాలయం, కాశిబుగ్గలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయం, రంగనాథస్వామి దేవాలయం, ఓసిటీలోని ఆంజనేయస్వామి దేవాలయంలో, దత్తక్షేత్రం, జలేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరంగల్ స్టేషన్‌రోడ్డులోని శ్రీరాధా కృష్ణ గార్డెన్‌లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో 108 శివ లింగాలను, మానస సరోవరం మంచులింగం, స్పటిక లింగాలను భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు. శ్రీభద్రకాళి అమ్మవారి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రాన్ని ఉత్తరాఖండ్ ఉజ్జయిని సిద్దగురు పీఠాధిపతి శ్రీచైతన్యానంద గురు మహారాజ్ సందర్శించారు. కార్యక్రమంలో అర్చకులు రాపాక గోపీకృష్ణ శర్మ, ట్రస్టు సభ్యులు వామన్‌రావు పాల్గొన్నారు.

● వరంగల్‌సిటీ: కాశిబుగ్గ శ్రీకాశీవిశ్వేశ్వరాయలంలో మహాశివరాత్రి మహోత్సవాలు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచే భక్తులు పోటెత్తారు. సాయంత్రం శ్రీవాసవిగణపతి సేవా సమితి, శ్రీవాసవి గణపతి పరపతి సంఘం ప్రతినిధులు యర్ర ప్రకాష్, దుబ్బ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు పండ్ల పంపిణీ చేశారు. రవళి నటత్య కళాక్షేత్ర హనుమకొండ వారిచే సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు ముత్యాల పరమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్త సంగీత భజన కార్యక్రమం, రాత్రి 12 గంటలకు లిగోద్భవ కాల విశేష పూజలు నిర్వహించారు. శ్రీకాశీవిశ్వేశ్వర శ్రీరంగనాథస్వామి ఆలయ అతి పూరతనమైనది కావడం, కాకతీయ రాజుల చరిత్రలో ఈ దేవాలయంలో పూజలు నిర్వహించినట్లు చరిత్ర చెపుతుండడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేకపూజలు నిర్వహించారు. కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు భూక్యా మోతీలాల్ నాయక్ బుధవారమే కాశీ చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి పవిత్ర శుద్ధ జలంతో కాశీవిశ్వేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. ఐదేళ్లుగా ఇదే రీతిన కాశీ నుంచి జలాన్ని తీసుకు వచ్చి శివలింగానికి అభిషేకం చేస్తున్నారు. శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయంలో సైతం మోతీలాల్ నాయక్ పూజలు నిర్వహించారు.

● కరీమాబాద్: ఉర్సు కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట, రంగశాయిపేట, శంభునిపేట ప్రాంతాల్లోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉర్సు బొడ్రాయి శివాంజనేయ దేవాలయం, కరీమాబాద్‌లోని శ్రీ శివనాగేంద్ర దేవాలయం, కరీమాబాద్‌లోని శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి (బొమ్మలగుడి)లో భక్తులతో కిటకిట లాడాయి. రంగశాయిపేటలోని వడ్డవాడ శ్రీరామలింగేశ్వర దేవాలయం, మేరవాడలోని శ్రీభవానీశంకర ఆలయం, శంభునిపేట విశ్వనాథ్‌కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు.

హిందూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని, హైందవ ధర్మం చాలా గొప్పదని ఆధ్యాత్మిక గురువు శ్రీ రాధా మనోహర్‌దాస్ అన్నారు. శుక్రవారం రంగశాయిపేట మహంకాళి అమ్మవారిని ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు దాస్‌కు స్వాగతం పలికారు. అమ్మవారి శక్తితో ఈ ప్రాంతం సుభిక్షంగా, శక్తివంతమైన ప్రాంతంగా విరాజిల్లుతుందని ఆయన అన్నారు.

మేయర్ పూజలు

రంగశాయిపేట వడ్లవాడ శ్రీ రామలింగేశ్వర దేవాలయాన్ని రాత్రి నగర మేయర్ గుండు సుధారాణి సందర్శించి పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ముత్తినేని రామ్మూర్తి, ఆలయ అర్చకులు వెలిదే ప్రదీప్‌శర్మ, ప్రభాకర్ శాస్త్రీ, కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్‌లు స్వాగతం పలికారు.

● రంగశాయిపేటలోని శ్రీ రామలింగేశ్వర దేవాలయంలో జగిత్యాల సివిల్ జడ్జి కంచ ప్రసాద్ చంద్రిక, 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచం దర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ప్రభాకర్ శాస్త్రీ, కమిటీ సభ్యులు రవీందర్, కరుణాకర్, శ్రీధర్, రవీందర్, నరసింహరాములు, సదానందం పాల్గొన్నారు.

● సంగెం: మండల వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీసంగమేశ్వరాలయంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి -జ్యోతి దంపతులు పూజలు నిర్వహించారు. చింతలపల్లిలోని శ్రీభవాని శంకర దేవాలయంలో ఆలయ ప్రధాన పూజారి సముద్రాల సుదర్శనాచార్యుల, హర్షచార్యుల నేతృత్వంలో ఆలయంలో అభిషేకాలు జరిగాయి. అలాగే, శ్రీసంగమేశ్వరాలయంలో ఆలయ కమిటీ చెర్మన్ కందకట్ల నరహరి ఆధ్వర్యంలో పూజారి నాగేంద్ర స్వామి, గోపికృష్ణల నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయంలో మంచులింగం ఏర్పాటుచేయగా ఎంపీపీ కందకట్ల కళావతి - నరహరి దంపతులు, మాజీ సర్పంచ్ గుండేటి బాబు, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, ఎంపీటీసీ మల్లయ్య పూజలు చేశారు. గవిచర్లలో ఆలయ కమిటీ చైర్మన్ లింగాల సరిత -భాస్కర్‌రెడ్డి,సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దొనికెల రమశ్రీనివాస్, ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కాత్రపల్లి హవేళి, గవిచర్ల-ఆశాలపల్లి గ్రామాల సరిహద్దుల్లో గల శ్రీపర్వతాల మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను పూజారి నిర్వహించారు.

● గీసుగొండ: ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో కైలాసగిరుల అలంక రణలో శివలింగ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, హర్షాచార్యులు, ఎంపీటీసీ వీరారావు, ఆలయ కమిటి చైర్మన్ బాబురావు పాల్గొన్నారు. కీర్తినగర్ నిమిషాంబదేవి ఆలయం, కోటి లింగాల గుడిలో కార్పొరేటర్ మనీషాశివ కుమార్ దంపతులు పూజలు నిర్వహించారు. గీసుగొండ శివాలయం, ధర్మారం రామలింగేశ్వర, ఎలుకుర్తి గంగాభవాని సమేత వైద్య నాదేశ్వర ఆలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

● పోచమ్మమైదాన్: నగరంలోని గురుధామంలో (సప్తధామ్) శివానంద గురు కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. శివానందగురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ నేతృత్వంలో శివానందీశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం జరిపించారు. శివానందగురు రెండో కుమారుడు, ప్రముఖ సినీ నిర్మాత కందుకూరి రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం, గోపాల్‌రెడ్డి, ఆనంద్‌కామేష్, సుదర్శన్‌రావు, మేనే జింగ్ ట్రస్టి గోపిచంద్ పాల్గొన్నారు. అలాగే పైడిపెల్లిలోని పురాతన శివాలయంలో శివరాత్రి వేడుకలు నిర్వహించారు. అలాగే దేశాయిపేట లక్ష్మి టౌన్‌షిప్ సమీపంలోని శివాలయంలో శివరాత్రి సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేక పూజలు చేశారు.

● ఖిలావరంగల్: ఖిలావరంగల్‌లోని స్వయంభూ దేవాలయం, శివనగర్‌లోని సీతారామచంద్రాలయం, శివగణపతిదేవాలయం, ముత్యాలమ్మ దేవాలయం, లేబర్‌కాలనీలోని పంచముఖనాగవీరేశ్వరాలయం, తదితర దేవాలయాలలో పూజలు చేశారు. మధ్యకోటలోని స్వయంభూ-శంభులింగేశ్వరస్వామి దేవాలయం, శివనగర్‌లోని శివాలయం, లేబర్‌కాలనీలోని పంచముఖనాగ వీరేశ్వరాలయంలో అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. ఖిలావరంగల్‌లోని స్వయంభూ దేవాలయంలో మంత్రి కొండా సురేఖ ప్రత్యేక పూజలు చేశారు.



ఖిలావరంగల్ స్వయంభూ దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి



సంగెంలో పట్టువస్త్రాలతో వస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి దంపతులు



రంగశాయిపేటలోని రామలింగేశ్వర దేవాలయంలో జగిత్యాల సివిల్ జడ్జి ప్రసాద్ దంపతులు



గురుధామంలో శివకల్యాణం చేస్తున్న అర్చకులు



దత్తక్షేత్రంలో సచ్చిదానందేశ్వరుడికి హారతి ఇస్తున్న సిద్దగురు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

వరంగల్ సిటీ, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖను శుక్రవారం హనుమకొండలోని ఆమె నివాసంలో వరంగల్ తూర్పుకు చెందిన టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో ముందుకు సాగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మంతెన సునీత, బంక సరళాదేవి, నారగోని స్వప్న, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కూచన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

● సంగెం: గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఎత్తివేయాలని అఖిల భారత మహిళా మండల సమాఖ్య అధ్యక్షురాలు రేణుక డిమాండ్ చేశారు. సంగెం మండలం కుంటపల్లిలో సీపీఐ అనుబంధం అఖిల భారత మండల మహిళా సమాఖ్య ప్రతినిధి సునీత ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ఖండించాలని అన్నారు. మహిళలపై దైర్జన్యం చేసిన మృగాళ్లకు ఉరి శిక్ష వేయాలని మహిళలు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంసీపీఐ మండల కార్యదర్శి ఎండి ఇస్మాయిల్, రైతు సంఘం నాయకులు గోనె రామచందర్, రైతు శ్రీను, అశోక్, రవి, సాంబయ్య, వెంకటన్న, వీరమల్లు పాల్గొన్నారు.

● కరీమాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కరీమాబాద్‌లోని వాటర్ ట్యాంక్‌కు చెందిన పారిశుధ్య కార్మికురాలు ఐలమ్మను సత్కరించారు. రవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. కార్యక్రమంలో జవాన్ సతీష్, ప్రశాంత్ పాల్గొన్నారు.



మంత్రి సురేఖకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న మీసాల ప్రకాష్ తదితరులు


● పోచమ్మమైదాన్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తోందని కాంగ్రెస్ నాయకుడు జన్ను పరంజ్యోతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జన్ను పరంజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ నుంచి ఎంజీఎం చౌరస్తా వరకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్యారంటీల మహిళా కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జన్ను పూర్ణ ప్రసన్న, గిన్నారం రాజు, బొట్ల ప్రసాద్, సోరం అభిలాష్, కోగిల సుధాకర్, వస్కుల విజయ్, పులుకురి వినయ్, జన్ను ప్రమీల, కుమ్మరి పూర్ణ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: భూదేవికి ఉన్న ఓర్పు స్త్రీ మూర్తికి ఉందని రాష్ట్ర మహిళా కార్యదర్శి గిరిగిరి పుష్ప అన్నారు. క్రిస్టియన్ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీపీసీసీ సభ్యుడు నల్గొండ రమేష్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ ఇన్‌చార్జి మరుపట్ల సాయికుమార్, డివిజన్ అధ్యక్షురాలు ఈసంపల్లి శ్వేత, కాంగ్రెస్ నాయకులు మడిపల్లి అమృతరావు, భైరపాక డేవిడ్‌రాజ్, జన్ను అరవింద్, కొలిపాక వేణు, కొనగల నరసింహా, సెబాస్టిన్, మేకల సుగుణ, గనిపాక సువర్ణ, జన్ను శోభ, పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా మెడికల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మైదం రాజు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిశారు. శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు.

మహిళా కానిస్టేబుల్స్‌కు సన్మానం

కరీమాబాద్: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మల్లయ్య ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుల్స్‌ను సన్మానించారు. విధులు నిర్వర్తిస్తున్న రాధిక, సంధ్య అనూషలను సత్కరించి, స్వీట్లు అందజేశారు.



పోచమ్మమైదాన్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు, కుంటపల్లిలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు, క్రిస్టియన్ కాలనీలో కేక్ కట్ చేస్తున్న నల్గొండ రమేష్

ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన నందిరాం



వరంగల్ టౌన్, మార్చి 8: వరంగల్ ఏసీపీగా నందిరాం నాయక్ శుక్రవారం మట్టెవాడలోని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. నందిరాం 1995లో పోలీసు శాఖలో ఎస్సైగా పనిచేశారు. 1995లో మడికొండ ఎస్సైగా, జనగామ, రేగొండ, తొర్రూర్, రఘునాథ్‌పల్లి, కాజీపేట ఎస్సైగా పనిచేశారు. 2010లో సీఐగా పదోన్నతి పొందారు. మడికొండ సీఐగా మహబూబాబాద్, మిల్స్ కాలనీ, ట్రాన్స్‌ఫోర్స్‌గా సీఐగా పనిచేశారు. 2022లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. సీఐడీ, డీఎస్పీగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ నందిరాం నాయక్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. రౌడీషీటర్లపై పోలీసుల నిఘా పెంచుతామన్నారు. భూతగాదాల్లో ఎవరైనా తలదూర్చుతే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన నందిరాం నాయక్‌ను వరంగల్ సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏనుమాముల ఎస్‌హెచ్‌వోగా రమేష్ బాధ్యతల స్వీకరణ



వరంగల్‌సిటీ, మార్చి 8: ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా శుక్రవారం పులి రమేష్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన కిషన్ సీఎస్‌బీ వరంగల్‌కు బదిలీ అయ్యారు. పోలీస్ డిపార్టుమెంట్‌లో ఈ మధ్య కాలంలో వారం గడువక ముందే బదిలీలు కావడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది.

హరీష్‌రావు వ్యాఖ్యలు అభ్యంతరకరం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 8: రైతు బంధు డబ్బులు ఆపీ ఏసీ గదుల్లో కూర్చునే ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు చెల్లించిందని మాజీ మంత్రి హరీష్‌రావు గురువారం చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్ తెలిపారు. ఈ మేరకు ఆయన హరీష్‌రావు వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన వ్యాఖ్యలు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఉద్యోగులను అవమానించడమేనన్నారు. రైతు బంధుకు ఉద్యోగులెవరు వ్యతిరేకం కాదని, రైతు బంధుకు, ఉద్యోగుల వేతనానికి సంబంధం ఏంటని హరీష్‌రావును ఆయన ప్రశ్నించారు. హరీష్‌రావు తన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓరుగల్లు హస్తం ఎవరికో?

(5వ పేజీ తరువాయి)

వేస్తున్నట్లుగా సమాచారం.

కాగా, ఒక దశలో దొమ్మాటి సాంబయ్యకు టికెట్ ఖరారైందనే ప్రచారం జరిగింది. అనుహ్యంగా తొలిజాబితాలో వరంగల్ ఎంపీ స్థానం అభ్యర్థి పేరు లేకపోవటంతో అధిష్ఠానం అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టిసారించిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. అందులో భాగంగానే బీఆర్ఎస్‌కు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేతో కాంగ్రెస్‌లోని ఓ కీలకమైన నేత సంప్రదింపులు జనుపుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఆ మాజీ ఎమ్మెల్యే చేరికపై ఒకరిద్దరు ఎమ్మెల్యేలు అభ్యంతరాలు చెప్పుతున్నట్లుగా తెలిసింది. మరోవైపు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు కూడా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లుగా సమాచారం. అలాగే 2016 వరంగల్ పార్లమెంట్‌కు జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన సీనియర్ నేత సర్వే సత్యనారాయణ కూడా తనకు వరంగల్ సీటు కేటాయించాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా సమాచారం. అలాగే కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్ కూడా వరంగల్‌పై నజర్ వేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. వరంగల్ టికెట్‌పై అనుహ్యంగా తీవ్ర పోటీ పెరుగుతుండటంతో అధిష్ఠానం తొలిజాబితాలో ప్రకటించలేదని సమాచారం. మొత్తానికి వరంగల్ కాంగ్రెస్ టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ కేడర్‌లో నెలకొంది.

బీఆర్ఎస్, బీజేపీలోనూ..

వరంగల్ ఎంపీ స్థానంలో పోటీచేసే అభ్యర్థిని ఇప్పటి వరకు ప్రధాన పార్టీలు ఏవీ కూడా ప్రకటించలేదు. ఇటీవలే తెలంగాణలో పోటీచేసే 9మంది పేర్లు ప్రకటించిన బీజేపీ.. వరంగల్ స్థానాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టింది. దీంతో బీజేపీలో వరంగల్ టికెట్ ఎవరికి అనే ఉత్కంఠ నెలకొంది. అలాగే బీఆర్ఎస్ సైతం మహబూబాబాద్ టికెట్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకే ఖరారు చేసింది. కానీ వరంగల్ స్థానం నుంచి ఎవరు పోటీచేస్తారనే విషయంపై స్పష్టత ఇవ్వటం లేదు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె వరంగల్ ఎంపీ టికెట్ అడుగుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే అధికారికంగా ఇంకా ఎవరినీ ప్రకటించకపోవడంతో క్యాడర్‌లో ఉత్కంఠ నెలకొంది.

భారీ వాహనాల తాకిడికి కూలిన విద్యుత్ స్తంభాలు



కాత్రపల్లి వద్ద కూలిపోయిన స్తంభాలను సరిచేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

సంగెం, మార్చి 8 : కాపులకనుపర్తి నుంచి కాత్రపల్లి, కుంటపల్లి, సంగెం గ్రామాల మీదుగా వెళ్లే రహదారిలో విద్యుత్తు స్తంభాలు కూలి పోయాయి. కుంటపల్లిలో కూలిన విద్యుత్తు స్తంభాలను శుక్రవారం వరంగల్ రూరల్ డివిజన్ ఇంజనీర్ భిక్షపతి, కాపులపనుపర్తి ఫస్ట్, డివిజన్ ఇంజనీర్ నరసింహారావు, అసిస్టెంట్ ఇంజనీర్ తిరుపతిరెడ్డి కాంట్రాకర్లు సందర్శించి పరిశీలించారు. కుంట పల్లి వద్ద కూలిన స్తంభాలను అధికారులు మరమ్మతులు చేశారు. చింతలపల్లిలోని టెక్స్‌టైల్ పార్కు వైపు రెండు అదిక లోడ్‌తో వెళ్లే రెండు కంటైనర్లు తాకడంతో కూలినట్లు అధికారులు తెలిపారు. గురువారం అర్థరాత్రి జరిగిన ఘటనతో ఆయా గ్రామాలకు విద్యుత్తు అంతరాయం ఏర్పడినట్లు వారు వివరించారు. కుంటపల్లి, సంగెం గ్రామాలకు వెళ్లి సర్వీస్ వైర్లు తెలి పడినట్లు వారు తెలిపారు. మండలంలోని గవిచర్ల, తీగరాజుపల్లి, కుంటపల్లి, కాంత్రపల్లి వెంకటాపురం గ్రామాల్లో నుంచి టెక్స్‌టైల్స్ పార్కుకు ఎత్తైన బారీ వాహనాలలు (కాంటినర్లు) అర్థరాత్రి వేళ్లల్లో రాక పోకలతో విద్యుత్తు వైర్లకు ప్రమాదం ఏర్పడుతుందని వారు తెలిపారు.



ఏడు నెలలుగా జీపీ సిబ్బందికి అందని వేతనాలు

11న ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నా : సీఐటీయూ

నెక్కొండ, మార్చి 8 : గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు గత ఏడు నెలలుగా ప్రభుత్వం చెల్లించక పోవడంతో కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయంటూ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య ఆవేదన వ్యక్తంచేశారు.మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబరు 51 సవరించడంతో పాటు మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. జీపీ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, జీవో నెంబరు 60 ప్రకారం జీపీ కార్మికులకు వెంటనే వేతనాలు పెంచాలంటూ డిమాండ్‌చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 11న రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం మండల ప్రధానకార్యదర్శి చెలకలపల్లి వీరస్వామి, ఈదునూరి సాయిలు, కృష్ణ, మదార్, హైమ, యాకయ్య, కొమురయ్య, కరుణాకర్, వెంకటేశ్ , రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



పార్వతమ్మను సన్మానిస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

నర్సంపేట, మార్చి 8 : మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు నూనె పద్మ, కోతి మమత, ఇస్లావత్ పద్మబాయ్, పావని, మాలోతు అంజలి, రమాదేవి, తక్కళ్లపల్లి ఉమాదేవి, కౌన్సిలర్ పెండెం లక్ష్మి, ఓర్సు అంజలి, బ్లాక్ అధ్యక్షురాలు ఆడెపు రమ, మాజీ సర్పంచు చిలువేరు రజనీ భారతి తదితరులు పాల్గొన్నారు. అలాగే నర్సంపేట పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో మహిళాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎర్ర జగన్‌మోహన్ రెడ్డి, డైరెక్టర్ ఎర్ర ఉర్మిళదేవి పాఠశాల ప్రిన్సిపాల్ కడియం శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ ఆకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

• నర్సంపేట టౌన్ : నర్సంపేట పట్టణంలోని లీడ్ గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లీడ్ గ్రంథాలయ వ్యవస్థాపకులు కాసుల రవి కుమార్, శోభారాణి మాట్లాడుతూ మహిళల అక్షరాస్యతలో ముందున్న దేశాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయన్నారు. వివిధ రంగాల్లో విజేతలైన మహిళల విజయగాథలను నేటి బాలికలకు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సాహితి, కవిత, నందగోపాల్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

• నెక్కొండ : భారతదేశంలో మహిళలపై జరుగుతున్న అగత్యాలను అరికట్టి, దేశ సంస్కృతిని కాపాడాలని ఎస్ఎఫ్ఐడబ్ల్యూ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత పిలుపు నిచ్చారు. మండలంలోని పనికర క్రాస్ రోడ్డు వద్ద జరిగిన మహిళ దినోత్సవంలో ఆమె జెండా ఆవిష్కరించి మాట్లాడారు. దేశ సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తూ విదేశీ విష సంస్కృతికి కొమ్ము కాస్తున్న దోషులకు కాపలా ఉంటున్న ప్రభుత్వాలను కూలదోయడానికి మహిళా శక్తి ఏకంకావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు కనుకల దేవపాల , నాయకులు విక్టోరియా, సుమలత, వెంకటలక్ష్మి, సరిత, రవళి, రజిత, సుగుణ, నీలమ్మ, సౌజన్య రాజమ్మ, రమ, పద్మ, శ్రీలత, బుచ్చమ్మ పాల్గొన్నారు. అలాగే పీఆర్టీయూ నెక్కొండ మండల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్సీ భవనంలోని భవిత సెంటర్‌లో మహిళ ఉపాధ్యాయులను శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. మండల విద్యాశాఖాధికారి వి.రత్నమాల, సంఘం బాధ్యులు డి.సుకన్య, వి.వినీత, ఉదయశ్రీ, హేమమాలిని, రజీత, మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు మాలోతు ప్రతాప్‌సింగ్, ప్రధానకార్యదర్శి కర్ర యాకుబ్‌రెడ్డి పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సిద్దార్థలో విద్యా సంస్థల చైర్మన్ కంది విజయగోపాల్‌రెడ్డి కేక్ కట్‌చేసి, మాట్లాడారు. మహిళలు అన్నీ రంగాలల్లో రాణించాలన్నారు. ప్రతీ మహిళ ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఇప్పటికే మహిళలు ఆర్థిక స్వాలంబన దిశగా ఉన్నారన్నారు. అలాగే ఐకేపీ కార్యాలయంలో మహిళలు కేక్ కట్‌చేశారు. పలువురు మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అండెం కర్ణాకర్‌రెడ్డి, జున్నూతుల కవిత, నామాల సృజన, దివ్యజ్యోతి, స్రవంతి, రోజారాణి, కవిత, రోజా, స్వప్న, కాచవరపు సంధ్య, మౌనిక, శైలజ, సునీత, గీత, యాట శ్రావణి, శిరీష, ఏపీఎం ఈశ్వరయ్య, వీవో అధ్యక్షురాలు కద్దూరి హైమ, ఆమని, సుధా, కోమల, రజిత తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలో వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు కొండా రాజేశ్వరిని క్లబ్ అధ్యక్షురాలు యాంసాని రాధిక, సెక్రెటరీ అడ్డగూడి లావణ్య, సభ్యులు ఆత్మకూరు సుజాత, గండె ఉమాదేవి కలిసి శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదని అభిప్రాయపడ్డారు. ఏ పక్షి ఒక రెక్కతో ఎదగలేదని అన్న స్వామి వివేకానంద మాటలు మరోసారి గుర్తు చేశారు.

శివోహం

• ఆలయాల్లో మార్మోగిన శివనామస్మరణ • వైభవంగా శివపార్వతుల కల్యాణం

నర్సంపేట, మార్చి 8 : నర్సంపేట నియోజకవర్గంలోని శైవక్షేత్రాలలో శు క్రవారం మహాశివరాత్రి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హరోహర, శివోహం.. శివహరహర, మహాదేవ శంభోశంకర... ఓం నమశ్శి వాయః అంటూ బోళా శంకరుడి నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.నర్సంపేటలోని శివాంజనేయస్వామి దేవాలయం, మాధన్నపేట చెరువుకట్టపై వెలసిన రామలింగేశ్వరాలయాలకు భక్తులు శుక్రవారం తెల్లవారు జామునే చేరుకొని ధ్వజస్తంభాల ఎదుట దీపాలు వెలిగించి పసుపు, కుంకుమ, పూలు చల్లి, పూజలుచేసి భక్తిని చాటుకున్నారు. మాధన్నపేట చెరువుకట్టపై వెలసిన రామలింగేశ్వరాలయంలో ఆలయ నిర్మాణ దాత దొడ్డ మోహన్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. శివాంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు భక్తులచే శివలింగానికి అభిషేక పూజలు చేయించి గోత్రనామ అర్చన పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు జాగరణ ఉండే భక్తుల కోసం ఏర్పాటు చేయించారు. ఆలయాలకు చిన్నారి బాల బాలికలు, విద్యార్థులు, యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు వెళ్ళి దైవదర్శనం చేసుకొని పూజలు చేశారు.

• నెక్కొండ: మండలంలోని వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో శివరాత్రి వేడుకలను వైభవంగా జరిపారు. శివాలయాలను రంగు రంగుల విద్యుత్ కాంతుల్లో ప్రత్యేకంగా అలంకరించగా భక్తులు ఉదయం ఐదు గంటల నుంచి ఆలయాల్లో జరిగిన ప్రత్యేకాభిషేక పూజల్లో పాల్గొన్నారు. నెక్కొండలోని ఆర్య వైశ్య మహిళ సంఘం సభ్యులు రూ.78 వేల విలువ కలిగిన వెండి నాగభరణిని నెక్కొండ శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, ఆలయ అర్చకులు బీవీఎస్ శాస్త్రీ, అర్చకులు శ్రావణ్‌కుమార్, డీఎస్ పవన్ కుమార్‌లకు అందించారు.

• చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి, లింగాపురంతో పాటు పలు గ్రామాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంబిక సిద్దేశ్వరాలయంలో శివలింగానికి ప్రత్యేక అలంకరణ చేసి, పలు అభిషేక పూజలను నిర్వహించారు. స్వీటు హౌజ్ యజమాని రాజ్‌గురు గీతాదేవి ప్రకాష్‌సింగ్ రూ.10వేలు విలువ చేసే డమురకం అందించారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణోత్సవానికి కాసుల శ్రీలత వీరాచారి దంపతులు బంగారు పుస్తే, మట్టెలను, పట్టు వస్త్రా లను భూషబోయిన తేజస్విని, రాజేష్ దంపతులు అందించారు. శివపార్వతులు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఊరేగింపు సేవలను నిర్వహించారు. అలాగే ఉప్పరపల్లిలోని నాగేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

• ఖానాపురం: మహాశివరాత్రి వేడుకలను మండల వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. ధర్మరావుపేట శివారులో బాలుతండాలోని త్రికుట శివాలయం, ధర్మరావుపేట శివరామక్షేత్రం, కొత్తూరు దుర్గామల్లేశ్వర ఆలయం, బుధరావుపేట వెంకటేశ్వర ఆలయం, అశోక్‌నగర్, ఖానాపురం, రంగాపురంలో ని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

• దుగ్గొండి : మండలంలోని వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మల్లంపల్లి, లక్ష్మీపురం శివాలయంలో, నాచినపల్లిలోని రామాలయం, తిమ్మంపేటలోని లక్ష్మీనర్సింహస్వామి, కేశవాపురంలోని వేంకటేశ్వరదేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

• పర్వతగిరి : మహాశివరాత్రి వేడుకలు మండలంలోని ఆయా గ్రామా ల్లోని శివాలయాల్లో వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని పర్వతాల శివాలయం, రామలింగేశ్వరస్వామి ఆలయం, కల్లెడ, కొంకపాక, అన్నారం షరీఫ్, రోళ్లకల్లు,చింతనెక్కొండ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ఉదయం నుంచే భక్తులు బారులు దీరారు. శివలింగాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిం చి పూజలు చేశారు. మండల కేంద్రంలోని రామలింగేశ్వర ఆలయంలో మట్టి శివలింగాన్ని తయారుచేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు చేసి జాగరణలు చేశారు. మండలంలోని రోళ్లకల్లు గ్రామ శంభుని దేవాలయానికి సాధ్యాతండాకు చెందిన సేవాలాల్ యూత్ అధ్య క్షుడు మూడు ప్రతాప్-జ్యోతి దంపతులు రూ.20వేలు విలువైన 200గ్రాముల వెండి కలశం, 50గ్రాముల ఉద్ధరిణి సమర్పించారు. మండల కేంద్రంలోని పర్వతాల శివాలయంతో పాటు రామలింగేశ్వర ఆలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఆయన సతీమణి ఉషా, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. పురోహితులు వారితో ప్రత్యేక పూజలు చేయించారు.

• నల్లబెల్లి: మండలంలో వైభవంగా మహా శివరాత్రి వేడుకలు జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయంలో, గుండ్లపహాడ్ గ్రామంలోని శివాలయంలో భక్తులు అర్చనలు, అభిషేకాలు, శివ కల్యాణం, లింగోద్భవ ఉత్సవాన్ని చేశారు. స్వామివారిని కమలపూలతో పాటు ప్రత్యేకమైన పూలతో అలంకరణ చేశారు. భక్తులు దేవాలయ ఆవరణలో ఉన్న గోమాతకు పండ్లను అందించారు. ఉదయం నుంచి రాత్రి 12 గంటలకు వరకు శివాలయాల్లో భక్తులు శివనామస్మరణతో భక్తి సంద్రంలో మునిగారు.

• రాయపర్తి: శివరాత్రి వేడుకలను మండల వ్యాప్తంగా నిర్వహించారు.ఆలయాల్లో భక్తులు శివలింగాలకు అభిషేకాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రాయపర్తి శివాలయం ప్రధాన అర్చకుడు మచ్చ గజం పంచాక్షరి, పెరకవేడు శివాలయం అర్చకుడు రాం చంద్రమూర్తి, సన్నూరు శివాలయం అర్చకుడు ఆరుట్ల రంగాచార్యులు శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిపించారు. భక్తులు ఉపవాసాలతో పాటు జాగరణ ఉండి మొక్కులు చెల్లించుకున్నారు.

• వర్ధన్నపేట : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. వర్ధన్నపేట పట్టణంలోని శివాలయంలో గుజ్జ యాదావతి సోమేశ్వర్‌రావు దంపతుల ఆధ్వర్యంలో శివపార్వ తుల కల్యాణాన్ని రంగశాయిపేట నాగమయ్య ఆలయ అర్చకుడు కోటయ్యశర్మ నేతృత్వంలో వర్ధన్నపేట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ పూజారులు కలకోట గోపాలచార్యులు, శ్రవణచార్యులు, రామాచార్యులు, శేషం వెంకట రమణాచార్యులు వేద మంత్రోచ్చరణ మధ్య వైభవంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

• వర్ధన్నపేట రూరల్: మహాశివరాత్రి వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. ఇల్లందలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలుచేశారు. శివలింగానికి అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆయా ఆలయాల నిర్వాహకులు చర్యలు చేపట్టారు.



నర్సంపేట శివాంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



నెక్కొండలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో వెండి నాగభరణి బహూకరిస్తున్న ఆర్యవైశ్య సంఘం



పర్వతగిరిలోని పర్వతాల శివాలయంలో శివలింగానికి అభిషేకాలు చేస్తున్న ఎర్రబెల్లి, అరూరి



పర్వతగిరిలోని రామలింగేశ్వర ఆలయంలో మట్టి శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు



రోళ్లకల్లులోని శంభుని ఆలయంలో ఆలయానికి వెండి కలశం బహుకరిస్తున్న దాతలు

15న నెక్కొండ అంగడి వేలం

నెక్కొండ, మార్చి 8 : నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న అంగడి (వారాంతపు సంత)లో విక్రయించే మేకలు, గొర్రెల, పశువుల రహదారి, తైబజారు రహదారి సంబంధించి ఈ నెల 15వ తేదిన వేలం పాటలు జరుగుతాయని కార్యదర్శి సదానందం శుక్రవారం తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం కాంట్రాక్టు పొందుటకు గాను ఈ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. జీపీ కార్యాలయ అవరణలో ఉదయం 11గంటలకు వేలం పాటలు ప్రారంభిస్తామన్నారు. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ రెండు గదుల అద్దెలకు సంబంధించి ఇదే రోజు మాధ్యాహ్నం 2.30 గంటలకు వేలం పాటలు జరుగుతాయని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలిక మృతి

రాయపర్తి, మార్చి 8 : విద్యుత్ షాక్‌తో బాలిక మృతి చెందిన సంఘటన మండలంలోని సన్నూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వీఆర్ఏ చిన్నపాక రవికిరణ్-మమత దంపతుల ఏకైక కుమార్తె స్రాన్ విదియా(5) ఇంట్లో ఉన్న ప్లగ్ వద్ద విద్యుత్‌వైరు తగిలి షాక్‌కు గురైంది. దీంతో అపస్మారకస్థితికి చేరుకున్న బాలికను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వర్ధన్నపేట రూరల్, మార్చి 8 : మండలంలోని ఇల్లంద గ్రామంలోని ఆకేరువాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై కఠినచర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

గడ్డివాము, పూరి గుడిసె దగ్ధం

ఖానాపురం, మార్చి 8: మండలంలోని బుధరావుపేటలో ప్రమాదవశాత్తు రెండున్నర ఎకరాల గడ్డివాము, పూరి గుడిసె శుక్రవారం దగ్ధమైంది. ఇదే గ్రామానికి చెందిన చెన్నబోయిన ఆనంద్ ఇల్లు, గడ్డివాము శ్మశాన వాటికకు వెళ్లే రహదారి పక్కన ఉంది. కాగా, గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందడంతో అంత్యక్రియల కోసం శ్మశానవాటికకు వెళ్లే క్రమంలో నిర్వహించిన శవయాత్రలో టపాసులు కాల్చడంతో నిప్పురవ్వలులేచి గడ్డివాముపై పడి గడ్డివాముతో పాటు పక్కనే ఉన్న పూరి గుడిసెకు మంటలు అంటుకొని దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.ఒక లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆనంద్ తెలిపారు. ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను ఆర్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుగ్గొండి, మార్చి 8 : మండలంలోని గిర్నిబావి, తిమ్మంపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని ఏఈ రామకృష్ణ శుక్రవారం వెల్లడించారు. సబ్‌స్టేషన్లలో సాంకేతిక పరమైన సమస్యలు ఉన్నందున విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని వినియోగదారులు, రైతులు గమనించాలని ఏఈ కోరారు.

శివరామక్షేత్రానికి వెండి నాగాభరణం బహూకరణ



ఆలయకమిటీ సభ్యులకు నాగాభరణాన్ని బహూకరిస్తున్న వెన్నెలక్క

ఖానాపురం, మార్చి 8 : మండలంలోని ధర్మరావుపేట శివ రామక్షేత్ర ఆలయానికి ఇదే గ్రామానికి చెందిన దివంగత మావోయిస్టు మాటూరి యాదగిరిగౌడ్ కుమార్తె మాజీ మావోయిస్టు వెన్నెలక్క సుమారు రూ.లక్ష విలువైన వెండి నాగాభరణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా వెన్నెలక్క మాట్లాడుతూ ధర్మరావుపేటలో ఆలయం నిర్మాణానికి గ్రామస్థులు సహకరించడం సంతోషంగా ఉందన్నారు. ఒకప్పుడూ గ్రామంలో నిత్యం గొడవలు, హత్యలు, పగలు, ప్రతీకారాలతో ప్రజలు రగిలిపోయేవారని, ఇలాంటి ఆలయాల నిర్మాణంతో గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనడంతో పాటు ఆధ్యాత్మిక చింతన, భక్తిభావం ప్రజల్లో నెలకొందన్నారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నడిపెల్లి రాజేశ్వర రావు, పల్లెపాటి సంపత్‌రావు, కోదాటి విద్యాసాగర్‌రావు, ఎర్రబెల్లి వసంతరావు, అద్దూరి మోహన్‌రావు, మేడి సమ్మయ్య, వెన్ను సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాల కోసం విరాళం అందజేత

చెన్నారావుపేట, మార్చి 8 : మండలంలోని పాపయ్యపేట గ్రామంలో నిర్వహించనున్న కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా విగ్రహాల కోసం దాతలు విరాళాలను శుక్రవారం అందించారు. కాటమయ్య ఉత్సవాల్లో సురమాంబా విగ్రహం కోసం రూ.75 వేలను మేడి రజిని- వెంకటేశ్వర్లు దంపతులు అందించారు. ఈ సందర్భంగా వారిని సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దమనిషి మేడి ప్రభాకర్, అధ్యక్షుడు కత్తి స్వామిగౌడ్, మాజీ అధ్యక్షుడు బండి రమేష్, బుర్ర సుదర్శన్‌గౌడ్, బుడిగె వెంకటేశ్వర్లు, బత్తిని యాకాంబ్రం, చిర్ర శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి భారీ మెజారిటీ అందించాలి

నర్సంపేట, మార్చి 8: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపి అభ్యర్థికి నర్సంపేట నియోజకవర్గంలో భారీ మెజారిటీ అందించా లని పార్టీ నాయకులు, కార్యకర్తల కు బీజేపీ నియోజక వర్గ చేరికల కమిటీ చైర్మెన్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పిలుపు నిచ్చారు. పట్టణం లో శుక్రవారం పట్టణ పార్టీ అధ్యక్షుడు శీలం రాంబాబు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం అ మలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. ఆయో ధ్యలో రామమందిరం నిర్మించి 140కోట్ల మంది భారతీయు లకు అంకితంచేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కు తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్ (పుల్లారావు), నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, మహబూబాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్, పట్టణ ముఖ్యనాయకులు, సీనియర్‌నాయకులు. బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

కోపాకుల చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న ముదిరాజ్‌లు, రైతులు

చెన్నారావుపేట, మార్చి 8 : మండలంలోనే అతి పెద్ద చెరువైన కోపాకుల చెరువు రోజు రోజుకు ఆక్రమణకు గురవుతున్నదని, ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ కులస్తులు, ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో అక్రమణకు గురువుతున్న చెరువు శిఖం భూములను వారు పరిశీలించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 356లో 336 ఎకరాల్లో కోపాకుల చెరవు విస్తీర్ణం ఉండగా, చెరువు మత్తడి స్థలంతో పాటు చెరవు శిఖంలోని కొన్ని ఎకరాల్లో చెరువు భూమి అక్రమణకు గురైందన్నారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు చెరువులో ఉన్న మొరంను అక్రమంగా తరలిస్తున్నరని ఆరోపించారు. కోపాకుల చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలని, ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చింతకాయల నరేందర్, వరంగంటి సంతోష్, హంస నరేష్, వీరభద్రయ్య, లక్క కుమారస్వామి, రాజు, హసం కుమారస్వామి, హంస మహేందర్ , ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

యువకులకు క్రికెట్ కిట్టు అందజేత

నర్సంపేట టౌన్, మార్చి 8 : నర్సంపేట మండలం దాసరిపల్లి గ్రామంలో దాసరి సాంబరెడ్డి జ్ఞాపకార్థం డీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు దాసరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలోని యువకులకు క్రికెట్ కిట్టును అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువకులకు క్రీడలు మానసికోల్లాసానికి, స్నేహ సంబంధాల పెంపునకు ఎంతగానో దోహదపడతాయన్నారు. భవిష్యత్తులో ప్రతీ గ్రామంలో డీఆర్ఆర్ ట్రస్టు తరుపున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.


కాలువ పునరుద్ధరణ పనులు ప్రారంభం

పర్వతగిరి, మార్చి 8: మండలంలోని చౌటపెల్లి గ్రామం నుంచి సోమారం, గుంటూరుపల్లి, గోరుగుట్టతండా, జగ్గు తండా, చెరువుముందు తండాల మీదుగా వెళ్లే ఎస్సారెస్పీ కాలువ పూడికతో పూర్తిగా పూడుకుపోవడంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఇటీవల ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తన సొంతఖర్చులతో ఎక్స్‌కవేటర్ మిషన్ తెప్పించి పూడికతీత పనులను చేపట్టారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ శుక్రవారం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, నాయకులు సరోజన, లచ్చునాయక్, భాస్కర్ నాయక్, పంతులునాయక్, వాగ్యనాయక్, గడ్డం జనార్ధన్, సోమ్లానాయక్, సుధాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్య కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపురం, మార్చి 8: మహిళ ఆరోగ్య కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో మహిళ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం పీహెచ్‌సీలో డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రతీ మహిళ ఆరోగ్యంగాఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి మంగళవారం, గురువారం పీహెచ్‌సీలో మహిళ ఆరోగ్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మహిళలు ప్రధానంగా ఎదుర్కొనే ఎనిమిది రకాల అనారోగ్య సమస్యలకు వైద్యం అందిస్తారన్నారు. ఏడాది కాలంలో 1309 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రుచిత, వైద్య సిబ్బంది కనకలక్ష్మి, సునిత, జ్యోతి, రజిత, ఎంపీటీసీలు భారతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి మృతి



సాంబయ్య (ఫైల్)

నర్సంపేట టౌన్, మార్చి 8 : తాటిచెట్టుపై నుంచి ప్రమా దవశాత్తు మోకు జారి కిందపడడంతో ఓ గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన నర్సంపేట మండలం గురిజాల గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. మృతుని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలా వున్నాయి. గ్రామానికి చెందిన మర్థ సాంబయ్య (65) వృత్తిలో భాగంగా శుక్రవారం రాత్రి తాటిచెట్టు చెట్టు ఎక్కి కల్లుగీతస్తుండగా ప్రమాదవ శాత్తు మోకుజారి కింద పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన సాంబయ్యను తోటి గీతకార్మికులు నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య సుశీల, కుమారుడు, కూతురు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

దుగ్గొండి, మార్చి 8 : మండలంలోని మల్లంపల్లిలోని కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 18 నుంచి పరీక్షలు జరుగుతున్నందున ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ మాట్లాడుతూ దాత శానబోయిన రాజ్‌కుమార్ విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన సామగ్రి పంపిణీ చేసినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల, బాలకృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

ఓరుగల్లు హస్తం ఎవరికో?

(5వ పేజీ తరువాయి)

వేస్తున్నట్లుగా సమాచారం.

కాగా, ఒక దశలో దొమ్మాటి సాంబయ్యకు టికెట్ ఖరారైందనే ప్రచారం జరిగింది. అనుహ్యంగా తొలిజాబితాలో వరంగల్ ఎంపీ స్థానం అభ్యర్థి పేరు లేకపోవటంతో అధిష్ఠానం అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టిసారించిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. అందులో భాగంగానే బీఆర్ఎస్‌కు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేతో కాంగ్రెస్‌లోని ఓ కీలకమైన నేత సంప్రదింపులు జనుపుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఆ మాజీ ఎమ్మెల్యే చేరికపై ఒకరిద్దరు ఎమ్మెల్యేలు అభ్యంతరాలు చెప్పుతున్నట్లుగా తెలిసింది. మరోవైపు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు కూడా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లుగా సమాచారం. అలాగే 2016 వరంగల్ పార్లమెంట్‌కు జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన సీనియర్ నేత సర్వే సత్యనారాయణ కూడా తనకు వరంగల్ సీటు కేటాయించాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా సమాచారం. అలాగే కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్ కూడా వరంగల్‌పై నజర్ వేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. వరంగల్ టికెట్‌పై అనుహ్యంగా తీవ్ర పోటీ పెరుగుతుండటంతో అధిష్ఠానం తొలి జాబితాలో ప్రకటించలేదని సమాచారం. మొత్తానికి వరంగల్ కాంగ్రెస్ టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ కేడర్‌లో నెలకొంది.

బీఆర్ఎస్, బీజేపీలోనూ..

వరంగల్ ఎంపీ స్థానంలో పోటీచేసే అభ్యర్థిని ఇప్పటి వరకు ప్రధానపార్టీలు ఏవీ కూడా ప్రకటించలేదు. ఇటీవలే తెలంగాణలో పోటీచేసే 9మంది పేర్లు ప్రకటించిన బీజేపీ.. వరంగల్ స్థానాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టింది. దీంతో బీజేపీలో వరంగల్ టికెట్ ఎవరికి అనే ఉత్కంఠ నెలకొంది. అలాగే బీఆర్ఎస్ సైతం మహబూబాబాద్ టికెట్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకే ఖరారు చేసింది. కానీ వరంగల్ స్థానం నుంచి ఎవరు పోటీచేస్తారనే విషయంపై స్పష్టత ఇవ్వటం లేదు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె వరంగల్ ఎంపీ టికెట్ అడుగుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే అధికారికంగా ఇంకా ఎవరినీ ప్రకటించకపోవడంతో క్యాడర్‌లో ఉత్కంఠ నెలకొంది.